క్లుప్తంగా

సెల్‌ఫోన్ల అప్పగింత



ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై రామన్‌కుమార్

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న రెండు సెల్‌ఫోన్లను ఆదివారం ఈజ్‌గాం ఎస్సై రామన్ కుమార్ బాధితులకు అప్పగించారు. ఈజ్‌గాంకు చెందిన జీత్ మండల్, తుంగమడుగు గ్రామానికి చెందిన కంబాల రమేశ్ సెల్‌ఫోన్‌లు పోయాయని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్‌చేసి బాధితులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ నయిాం, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్టాపన



విగ్రహాన్ని ప్రతిష్టిస్తున్న వేదపండితులు

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని పెద్దబండ వాగు వద్ద నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆదివారం అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్టాపన అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ ముసునూరి సూర్య భాస్కర శర్మ, ముసునూరి సాయికిరణ్ శర్మ ఆధ్వర్యంలో విగ్రహాన్ని ప్రతిష్టించారు. అనంతరం ప్రత్యేక పూజలు, భజనలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి అయ్యప్ప పడిపూజ నిర్వహించనున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు గురుస్వామి తులసీదాస్, తంగెడిపల్లి సంతోష్, కనకయ్య, బోర్కుటే రాజేందర్, కారం హన్మంతు, స్థానికులు, భక్తులు పాల్గొన్నారు.

సీఎం సభను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో సోమవారం నిర్వహించే సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభను పట్టణ ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు జయప్రదం చేయాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుడిపెల్లి నగేశ్ కోరారు. కార్యకర్తలు, నాయకులు పాల్గొనాలన్నారు.

నార్నూర్: సీఎం సభకు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావ్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని సీనియర్ నాయకుడు బానోత్ గజనంద్ నాయక్, నాయకులతో సమీక్ష నిర్వహించారు. గడప గడపకూ వెళ్లి ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దేవరవ్ లోకండే, మాజీ జెడ్పీటీసీ బిర్జులాల్, కోఆప్షన్ మెంబర్ షేక్ దస్తగిర్, పీఏసీఎస్ డైరెక్టర్ దుర్గే కాంతారావు, దాదే అలీ, నర్సింగ్ మొరే, కరీం ఖాన్, మహేందర్, యూసుఫ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంఎస్‌లో పలువురి చేరిక



శ్రీనివాస్‌ను యూనియన్‌లోకి ఆహ్వానిస్తున్న రియాజ్ అహ్మద్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని పలువురు ఉద్యోగులు హెచ్‌ఎంఎస్‌లో చేరారు. ఏరియాలోని యూనియన్ ఆఫీస్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆ యూనియన్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ హాజరై ఉద్యోగులకు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రియాజ్ మాట్లాడుతూ.. సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘాలతో రాజకీయ జోక్యం పెరిగి సింగరేణిలో అవినీతి పెరిగిపోతుందని ఆరోపించారు. యూనియన్ ఏ రాజకీయ పార్టీకి అనుబంధంగా లేదని, కార్మిక హక్కులే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. గెలిచిన యూనియన్‌కు వెంటనే గుర్తింపు పత్రం ఇవ్వాలని, లేకుంటే అన్ని కార్మిక సంఘాలను సమానంగా చూడాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు పార్వతి రాజిరెడ్డి, నాయకులు వెల్ది సుదర్శన్ గౌస్, శ్రీనివాసరెడ్డి, జే. శ్రీనివాస్, కుర్రె శంకర్ తదితరులు ఉన్నారు.

మహంకాళి జాతరకు వేళాయె

- రేపటి నుంచి మూడు రోజుల పాటు జాతర మహోత్సవం
- మొదటి రోజు శివ పార్వతుల కళ్యాణం
- రెండో రోజు అమ్మవారికి బోనాల సమర్పణ, వన భోజనాలు
- మూడో రోజు రోజు దర్శనం



ఇందిరానగర్‌లోని కనకదుర్గాదేవి, మహంకాళి ఆలయం



21 ఫీట్ల మహంకాళి అమ్మవారి విగ్రహం

రెబ్బెన: ఇద్దరు అమ్మలు కొలువైన పుణ్యక్షేత్రం. స్వయంభూగా వెలసిన మహంకాళి అమ్మవారితో పాటు కనకదుర్గాదేవి కొలువు దీరిన దేవస్థానం. ఉమ్మడి జిల్లాలోనే మహంకాళి అమ్మవారు స్వయంభూగా వెలిసిన ఆలయం కావడం ప్రత్యేకత. ఉమ్మడి జిల్లాతో పాటు పక్క జిల్లాల నుండి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. చైత్ర పౌర్ణమి రోజున మహంకాళి అమ్మవారి పుట్టిన రోజు సందర్భంగా రెబ్బెన మండలంలోని ఇందిరానగర్‌లో ఉన్న కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి అమ్మవారి ఆలయం జాతరకు సిద్ధమవుతోంది. మూడో రోజుల పాటు ఆలయంలో అమ్మవారి జాతర అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. జాతరకు జిల్లాలోని భక్తులతో పాటు గోదావరిఖని, మంచిర్యాల, కరీంనగర్, హైదరాబాద్, ఆదిలాబాద్, తదితర ప్రాంతాల నుండి భక్తులు అధికసంఖ్యలో తరలిరానున్నారు.

మూడు రోజుల పాటు జాతర

ఈ నెల 23 నుంచి 25 వరకు అమ్మవారి జాతర ఘనంగా జరగనుంది. మొదటి రోజు శివ పార్వతుల కల్యాణం, రెండో రోజు అమ్మవారికి బోనాల సమర్పణ, వన భోజనాలు, మూడో రోజు అమ్మవారి దర్శనం. చైత్ర పౌర్ణమి రోజున అమ్మవారిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. దూర ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులు బోనాల జాతరలో పాల్గొన్న అనంతరం అమ్మవారికి కోళ్లు, మేకలను బలిచ్చి ఆలయ ప్రాంగణంలోనే వన భోజనాలు ఏర్పాటు చేసుకుని రాత్రివేళలో బస చేస్తారు. దాంతో ఆలయ ప్రాంగణం అంతా భక్తులతో సందడిగా మారుతుంది.

అమ్మవారు స్వయంభూగా వెలసిన తీరు

మహంకాళి అమ్మవారు ఆలయంలో కొలువుదీరిన తీరు, ఆలయ నిర్మాణం, స్థల పురాణంపై గ్రామస్తులు ఈ విధంగా చెప్పుకుంటారు. ఒకప్పుడు రెబ్బెనలో అటవీప్రాంతం అధికంగా ఉండేది. పెద్దపులితో పాటు అనేక రకాల క్రూరమృగాలు సంచరిస్తుండేవి. ఆదివాసీ గిరిజనులతో పాటు ఇతరులు సైతం అటవీ సంపదపై ఆధారపడి జీవిస్తుండేవారు. ఈ క్రమంలో అడవిలోకి రాకపోకలు సాగించే సమయంలో తమను అటవీ జంతువులనుంచి కాపాడాలని మహంకాళి అమ్మవారికి మొక్కేవారు. అమ్మవారి దయ ఉంటే తమకు ఎలాంటి హాని కలగదని వారి నమ్మకం. మహారాష్ట్రలోని చంద్రపూర్‌లో మహంకాళి అమ్మవారు కొలువై ఉన్న మాదిరిగానే ఇందిరానగర్‌లో కొలువైన అమ్మవారిని నాటి భక్తులు గోదుమపిండి దీపం, బెల్లంపూర్ణ, తియ్యనిపాను, మేకలు, కోళ్లు బలిచ్చి పూజలు చేసేవారు. అలా భక్తుల పూజలు అందుకున్న అమ్మవారి విగ్రహం కొన్నేళ్లకు అతివృష్టి కారణంగా నీటిలో మునిగిపోయింది. ఆస్థలంలోనే పుట్ట ఏర్పడింది. చైత్ర మాసం పౌర్ణమి సమయానికి పుట్ట సంపూర్ణ ఆకారంలో భక్తులకు కనిపించగా భక్తులు అక్కడే పూజలు చేసేవారు.

భూగర్భంలో కొలువుదీరిన అమ్మవారు



గుహలో పడుకుని ఉన్న మహంకాళి అమ్మవారు

ఆలయం వెనుక భాగంలో భూగర్భంలోని గుహలో కొలువుదీరిన మహంకాళి అమ్మవారి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. మహారాష్ట్రలోని చంద్రపూర్ (చాందా) మహంకాళి ఆలయంలో ఉన్న మాదిరిగానే ప్రధాన ఆలయం వెనుక భాగంలో పది ఫీట్లలోతులో గుహను ఏర్పాటు చేసి అందులో పడుకుని ఉన్నట్లు అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఇందిరానగర్‌లో ఉన్న అమ్మవారిని దర్శించుకుంటే చంద్రపూర్‌లోని మహంకాళి ఆలయంలో భూగర్భంలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్న అనుభూతి భక్తుల్లో కలుగుతుంది. దీంతో పాటు ఆలయ ప్రాంగణంలో 21 ఫీట్ల ఎత్తులో ఏర్పాటు చేసిన మహంకాళి విగ్రహంతో పాటు 15 ఫీట్ల నాగదేవత విగ్రహాలు, శనేశ్వరుడి ఆలయం, కాలభైరవుడు, అరుణాచల శివుడి ఆలయాలు ఉన్నాయి.

పుట్ట నుంచి బయటపడిన విగ్రహం

కాగజ్‌నగర్‌లోని బారెగూడకు చెందిన మోర్లె నారాయణ, లక్ష్మి దంపతుల కుమారుడు వినోద్‌కు నాలుగేళ్ల వయస్సు నుండే అమ్మవారి భక్తుడు. 2014లో రెబ్బెన మండలంలో ఉంటున్న తన మేనత్త ఇంట్లో ఉండి చదువుకునేవాడు. ఈ క్రమంలో ఒకరోజు రాత్రి ఆయనకు కలలో పాము రూపంలో అమ్మవారు కనిపించి ఇందిరానగర్‌లో పుట్టలో ఉన్న తనను బయటకు తీసి పూజలు చేయమని చెప్పారట. మరుసటి రోజు నుండి తొమ్మిది రోజుల పాటు ప్రతిరోజు ఉదయం రాత్రి తొమ్మిది బిందెల చొప్పున పుట్టపై నీళ్లు పోయగా చైత్రపౌర్ణమి తరువాత అమ్మవారి శిలావిగ్రహం బయటపడింది. అప్పటి నుండి గ్రామస్తులు అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు 2015లో వినోద్ చిన్న ఆలయం నిర్మించి మహంకాళి అమ్మవారితో పాటు కనకదుర్గాదేవి విగ్రహాన్ని ఆలయంలో ప్రతిష్టించి ప్రతీరోజు పూజలు చేస్తున్నారు. దిన దినం ఆలయం అభివృద్ధి చెందుతూ రాగా కొన్నేళ్లగా అమ్మవారి జాతర మహోత్సవాలను నిర్వహిస్తూ వస్తున్నారు.

అందరి సహకారంతో అభివృద్ధి



2015లో చిన్న ఆలయంలో అమ్మవారిని ప్రతిష్టించగా అందరి సహకారంతో ఆలయం దినదినాభివృద్ధి చెందుతోంది. చైత్ర పౌర్ణమి రోజున అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తే కోరిన కోర్కెలు తీరుస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. జాతర సందర్భంగా అమ్మవారి పల్లకిసేవ, భజన కార్యక్రమాలు ఉంటాయి.

– దేవార వినోద్, ఆలయ ప్రధాన అర్చకులు

అన్ని ఏర్పాట్లు పూర్తి



మహారాష్ట్రలోని చంద్రపూర్ తరువాత ఈ ప్రాంతంలో స్వయంభూగా మహంకాళి అమ్మవారు కొలువుదీరిన ఏకైక ఆలయం. అందుకే ఈ ఆలయానికి అంతటి ప్రాధాన్యం సంతరించుకుంది. జాతరకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నాం.

– మోడెం తిరుపతిగౌడ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు

ప్రజలకు, పార్టీకి వారధిలా పనిచేయాలి

- ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్



తిర్యాణిలో మాట్లాడుతున్న గోడం నగేష్

తిర్యాణి: పార్లమెంటు ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బూత్ కమిటీ నాయకులు ప్రజలకు, పార్టీకి వారధిలా పనిచేయాలని ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ అన్నారు. ఆదివారం తిర్యాణి మండలంలోని రాళ్ల కన్నెపల్లిలో బూత్ కమిటీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ హయాంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గడప గడపకూ తీసుకెళ్లి వివరించాలన్నారు. మరోసారి కేంద్రంలో బీజేపీ జెండా ఎగురవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఆసిఫాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కోట్నాక విజయ్‌కుమార్, ఆసిఫాబాద్ జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, నాయకులు సొల్లు లక్ష్మి, కొలిపాక కిరణ్, పులి వెంకటేష్, సుభాష్, భాస్కర్, తిరుపతి, తులసిరామ్, తదితరులు పాల్గొన్నారు.

మోదీని మూడోసారి ప్రధానిని చేయడమే లక్ష్యంగా పనిచేయాలి

వాంకిడి: నరేంద్రమోదీని మూడోసారి ప్రధానిని చేయడమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త కష్టపడి పనిచేయాలని బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ అన్నారు. ఆదివారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్‌తో కలిసి బూత్ స్థాయి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ దుర్గం ఆర్తికతో పాటు పలువురు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కోకన్వీనర్ కిరణ్, అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఎలగతి సుచిత్ పాల్గొన్నారు.

నీటి సమస్య రాకుండా అప్రమత్తంగా ఉండాలి

జన్నారం: ఎండల తీవ్రత పెరుగుతున్నందునా గ్రామాల్లో నీటి సమస్య రాకుండా అప్రమత్తంగా ఉండాలని ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని పొనకల్, శ్రీలంక కాలనీ ప్రాంతాలలో ఆదివారం పర్యటించారు. అన్ని గ్రామాల కార్యదర్శులు నీటి సమస్య ఉంటే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు తెలుపాలని సూచించారు. ఏఈ అబురమ్, ఈవో రాహుల్ ఉన్నారు.

ప్రభుత్వ సొత్తు అపహరణ



పెద్దసిద్దాపూర్ సమీపంలోని పల్లె ప్రకృతి వనం

- చర్యలకు వెనుకాడుతున్న అధికారులు
- ఫిర్యాదు చేయకపోవడంపై తలెత్తుతున్న అనుమానాలు

బెజ్జూర్: ప్రభుత్వ సొత్తును గుర్తు తెలియని దుండగులు అపహరించినా సంబంధిత అధికారుల్లో మాత్రం చలనం లేకుండా పోయింది. బెజ్జూర్ మండలం పెద్ద సిద్దాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో గతంలో ఎంతో ఆర్భాటంగా మూడు పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. అందులో వివిధ రకాల మొక్కలు పెంచడంతో పాటు వాటికి రక్షణ కోసం సిమెంట్ పోల్స్ ఏర్పాటు చేసి ఫెన్సింగ్ వైర్లతో కంచె సైతం ఏర్పాటు చేశారు. అవి ఇటీవల చోరీకి గురయ్యాయి. వాటి విలువ రూ.లక్షకు పైగా ఉంటుందని తెలుస్తోంది. పల్లె ప్రజలకు ఆహ్లాదం పెంచేలా వీటిని ప్రభుత్వం ఏర్పాటు చేయగా అందులోని విలువైన వస్తువులు ఒక్కొక్కటిగా మాయమవుతున్నాయి.

పల్లె ప్రకృతి వనాలకు రక్షణ కరువు

పల్లె ప్రకృతి వనాలకు రక్షణ కరువైంది. లక్షల రూపాయల విలువ చేస్తే సామగ్రి చోరీకి గురవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఈ ప్రకృతి వనాల్లో చోరీ జరిగి దాదాపు వారం రోజులు కావస్తున్నా ఇప్పటివరకు సంబంధిత అధికారి కనీసం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయకపోవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామ పంచాయతీ ప్రజలకు సంబంధించిన ప్రభుత్వ సామగ్రికే రక్షణ లేకపోతే ఇక ప్రజల ఆస్తులకు అధికారులు ఏం రక్షణ కల్పిస్తారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి వైకుంఠంను వివరణ కోరగా పల్లె ప్రకృతి వనాలకు సంబంధించి పోల్స్‌తో పాటు ఫెన్సింగ్ వైర్లు చోరీకి గురైనట్లు సంబంధిత పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఎస్సై విక్రమ్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పడం గమనార్హం.

కొరవడిన పర్యవేక్షణ

పల్లె ప్రకృతి వనాల్లో పర్యవేక్షణ కొరవడింది. సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యటిస్తూ వాటిని పర్యవేక్షించాల్సి ఉండగా అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పెద్ద సిద్దాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మూడు పల్లె ప్రకృతి వనాల్లో సిమెంట్స్ పోల్స్‌తో పాటు విలువైన ఫెన్సింగ్ వైర్లు ఇటీవల కాలంలో చోరీకి గురయ్యాయి. సంబంధిత అధికారులు ఈ విషయమై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయితే తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు చెప్పడం గమనార్హం.

ఆసిఫాబాద్ పట్టణంలోని కంచుకోట ప్రాంతానికి చెందిన ఓ ఒంటరి మహిళ(25) జీవనోపాధి కోసం పట్టణంలోని ఓ ఫ్యాన్సీస్టోర్‌లో సేల్స్ ఉమెన్‌గా పని చేస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరి 17న రాత్రి పనులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా పుల్లుగా మద్యం సేవించిన నలుగురు వ్యక్తులు ఆమెపై లైంగిక దాడికి యత్నించారు. బాధితురాలు గట్టిగా కేకలు వేయడంతో మందుబాబులు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ పెనుగులాటలో దుండగులు ఆ మహిళపై భౌతిక దాడికి దిగడంతో తలకు గాయాలయ్యాయి.

కౌటాల మండల కేంద్రంలో ఈ నెల 19న రాత్రి మద్యం మత్తులో ఇద్దరు యువకులు మద్యం దుకాణాల పక్కనే ఉన్న ఇంటి ఆవరణలో మూత్రవిసర్జన చేశారు. గమనించిన ఇంటి యజమాని వారితో వాగ్వివాదానికి దిగాడు. ఈ క్రమంలో మందుబాబులు కర్రతో ఇంటి యజమాని పసాల వినోద్‌పై దాడి చేయడంతో గాయాలయ్యాయి. మద్యం మత్తులో వీరంగం సృష్టించి ఇంటి యజమానిపై దాడి చేసిన ఇద్దరు యువకులను స్థానికులు పోలీసులకు అప్పగించారు.

చుక్కేసి.. చుక్కలు చూపిస్తున్నారు..!

- జిల్లాలో ఏరులై పారుతున్న మద్యం
- రాత్రివేళ మందుబాబుల హల్‌చల్
- పట్టణ, మండల కేంద్రాల్లో రోడ్లపైనే సిట్టింగ్‌లు
- పోలీసులు దృష్టి పెట్టాలని ప్రజల వేడుకోలు



కౌటాల: జిల్లాలో మద్యం ఏరులై పారుతోంది. మద్యం దొరకని గ్రామం అంటూ లేదంటే అతిశయోక్తి కాదు. నిబంధనలకు విరుద్ధంగా జిల్లాలో ఎక్కడ బడితే అక్కడ మద్యం లభిస్తోంది. రాత్రి 7 గంటలు అయిందంటే చాలు ఈ ప్రాంతాలన్నీ రద్దీగా మారుతాయి. వాహనాలను ఎక్కడపడితే అక్కడ ఆపేస్తారు. పుల్లుగా మద్యం సేవించి ఇటు వాహనదారులు, అటు పాదచారులకు రాకపోకలకు ఆటంకం కలిగిస్తారు. ఇలాంటి సంఘటనలు జిల్లాలో నిత్యకృతం అయ్యాయి. ఆయా శాఖల అధికారులు పట్టించుకోకపోవడంతో మందుబాబుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది.

నివాసాల మధ్యలో..

జిల్లా కేంద్రంతో పాటు పట్టణాలు, మండల కేంద్రాల్లో నివాసాలు, పాఠశాలల మధ్య మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడంతో మహిళలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ లక్ష్యం(టార్గెట్) చేరుకోవడానికి వైన్స్‌ల యాజమానులే గొలుసు (బెల్ట్‌షాప్స్) దందాను ప్రోత్సహిస్తున్నారు. కావాల్సిన ముడుపులు ముట్టడంతో సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలున్నాయి. తెల్లవారుజాము నుంచి దుకాణాల్లో మందుబాబులు కావాల్సినంత సరకు లభిస్తోంది. తనిఖీలు చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. జిల్లాలో 32 మద్యం దుకాణాలు 3 బార్లు ఉన్నాయి. ఏటా రూ.200 పైచిలుకు కోట్ల సరకు అమ్ముడవుతోంది. మండల కేంద్రాల్లో పదుల సంఖ్యలో గొలుసు దుకాణాలు ఉండగా, జిల్లా వ్యాప్తంగా వాటి సంఖ్య 900లకు పైగా ఉన్నాయి. ముఖ్యంగా జిల్లా సరిహద్దు ప్రాంతాలైన కౌటాల, వాంకిడి, బెజ్జూర్, చింతలమానెపల్లి, సిర్పూర్(టి) మండలాల్లో ఇబ్బడిముబ్బడిగా వెలిసిన బెల్ట్ దుకాణాల్లో మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

బర్త్‌డే పార్టీలంటూ హల్‌చల్

ఇటీవల బర్త్‌డే పార్టీల పేరిట అలవికాని పనులు చేయడం జిల్లా కేంద్రాన్ని దాటి పట్టణాలు, మండలాలు, గ్రామాలకూ చేరింది. యువకులు మద్యం సేవించి అర్ధరాత్రి వేళ రోడ్లపై కేక్‌లు కట్‌చేయడం, మద్యం మత్తులో బాణాసంచా కాల్చటం వంటి ఘటనలతో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇదేంటని ఎవరైనా అడిగితే దాడులు చేయడానికీ వెనుకాడటం లేదు. ఇక వివాహాల ఊరేగింపుల్లో అనుమతి లేకుండా డీజేలను వినియోగిస్తూ శబ్ద కాలుష్యానికి కారణమవుతున్నారు. ముఖ్యంగా కౌటాల–బెజ్జూర్ ప్రధాన రహదారి వెంబడి కౌటాల నుంచి గురుడుపేట వరకు గల కల్వర్టులపై మందుబాబులు గుంపులుగా మద్యం సేవిస్తున్నారు. కౌటాల పల్లె ప్రకృతి వనం, మినీ స్టేడియం, తాటిపల్లి రహదారి వెంబడి మద్యం తాగి ఊగుతూ కనిపిస్తున్నారు. అటువైపు వెళ్లిన వారికి చుక్కలు చూపిస్తున్నారు.

పట్టించుకోని తల్లిదండ్రులు

బర్త్‌డే పార్టీలు అంటూ రాత్రి ఇంటినుంచి వెళ్తున్న వారిని తల్లిదండ్రులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. తెల్లవార్లూ ఇంటికి రాకపోయినా, వారు మద్యం సేవించి వస్తు న్నా చూసీ చూడనట్లు వదిలేస్తుండడంతో యువకులు ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారు. తల్లిదండ్రులు ఓ కన్నేసి నియంత్రిస్తే వారి జీవితాన్ని బాగుపర్చిన వారవుతారని చెప్పవచ్చు. పోలీసులు సైతం రాత్రిళ్లు పెట్రోలింగ్ పెంచాలని, తెల్లవార్లూ రోడ్లపై మద్యం మత్తులో తిరిగే ఆకతాయిల ఆగడాలను అరికట్టాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు



సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని చింతగూడ చౌరస్తా వద్ద రూ.53 కోట్ల అంచనాతో రైల్వే ఓవర్ బ్రిడ్జి మంజూరైన విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు శనివారం రాత్రి టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏప్రిల్ 5న బాబూజగ్జీవన్ రాం జయంతి సందర్భంగా హామీ ఇచ్చిన ఎమ్మెల్యే హరీశ్‌బాబు 15 రోజుల్లోనే రైల్వేమంత్రిత్వశాఖతో మాట్లాడి రైల్వే ఓవర్ బ్రిడ్జి మంజూరు చేయించారని అన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే పనులు ప్రారంభం అవుతాయని వారు స్పష్టం చేశారు. బ్రిడ్జి నిర్మాణం వల్ల ప్రధాన మార్కెట్‌లో రద్దీ కూడా తగ్గుతుందన్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణం వల్ల సర్‌సిల్క్, చింతగూడ, ఈజ్‌గాం, తదితర ప్రాంతాల ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. బ్రిడ్జి మంజూరు చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, రైల్వే అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు సిందం శ్రీనివాస్, నాయకులు ఈర్ల విశ్వేశ్వర్‌రావు, జాడి దీపక్, అరుణ్‌లోయా, సంతోశ్, శివా, సుమిత్‌గుప్తా, నాగేందర్,ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం 5 గంటలకు కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల ప్రచారం నిర్వహించనుంది. అనంతరం అటవీ నర్సరీ ఎదురుగా ఉన్న ఖాళీ మైదానంలో భారీ కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా, మండలంలోని 17 గ్రామ పంచాయతీలకు చెందిన తాజా మాజీ, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలతో పాటు పలువురు సీనియర్ ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. వీరంతా మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరనుండగా ఈ కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, ఎమ్మెల్యేలు గడ్డం వివేక్‌వెంకటస్వామి, గడ్డం వినోద్‌లతో పాటు పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీ కూడా కార్యక్రమానికి హాజరవుతున్నారు. ఈ కార్యక్రమంలో భారీ చేరికలు ఉంటాయని ప్రచారం జరుగుతోంది.